క్లుప్తంగా

కుష్ఠు నివారణ సర్వేపై అవగాహన

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో బుధవారం జాతీయ కుష్ఠు నివారణ సర్వే కార్యక్రమంపై ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి లోహిత్ చెంగల్‌రాయన్ మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి జూలై 16 వరకు సర్వే ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఆయా గ్రామాల్లో పర్యటించి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గుణశేఖర్, డీపీఎంఓ మణి, ఏపీఎంఓ హరికృష్ణ, ఎంపీహెచ్ఈఓలు బృహస్పతి, రమేష్ బాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిత్తూరు వన్‌టౌన్ సీఐగా విశ్వనాథరెడ్డి



చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ సీఐగా ఎస్.విశ్వనాథరెడ్డి నియమితులయ్యారు. గత కొంతకాలంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సీఐ ఎవరూ లేకపోవడంతో సీసీఎస్ సీఐ భాస్కర్ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. తాజాగా వైఎస్సార్ కడప జిల్లా రైల్వే కోడూరు సీఐగా పనిచేస్తున్న విశ్వనాథరెడ్డిని చిత్తూరుకు బదిలీ చేయడంతో బుధవారం ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

ఉపాధ్యాయుడి సేవలు అమోఘం



మధుసూదన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించి బదిలీపై పులిచెర్ల మండలానికి వెళుతున్న మధుసూదన్ రెడ్డి సేవలు అమోఘమని ఎంఈఓ కృష్ణా రెడ్డి అన్నారు. ఆయన్ను బుధవారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ, మధుసూదన్ రెడ్డి నిత్యం విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించేవారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు సోమశేఖర్ రాయుడు యూటీఎఫ్ కన్వీనర్ రెడ్డెప్ప నాయుడు, జెడ్పీటీసీ దేవిక సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

24న ట్రాక్టర్ల వేలం

శాంతిపురం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సుమారు ఎనిమిదేళ్లుగా వృథాగా ఉన్న రెండు ట్రాక్టర్లను శనివారం వేలం వేయనున్నట్టు ఎంపీడీవో హేమమాలిని ఓ ప్రకటనలో తెలిపారు. అప్పట్లో మండల పరిషత్‌కు కేటాయించిన ఈ ట్రాక్టర్లను కొంతకాలం వినియోగించినా సరైన రికార్డులు, వాహనాలు కండీషన్ లేకపోవడంతో వాటిని పార్కింగ్ షెడ్డులోనే ఉంచారు. వేలం వేయాలని నిర్ణయించిన అధికారులు చిత్తూరు ఎంవీఐ ద్వారా వాటి విలువను నిర్ధారించుకున్నారు. ఈ నెల 24న ఉదయం 11 గంటల్లోపు రూ.20 వేలకు డీడీని ధరావత్తుగా తీసుకువచ్చిన వారు వేలంలో పాల్గొనవచ్చని ఎంపీడీవో పేర్కొన్నారు. వేలం పాటదారులు 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించి ట్రాక్టరును పొందవచ్చని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆటోమేటిక్ నియంత్రణ వ్యవస్థ

కుప్పంరూరల్: విద్యుత్ ఆదాలో భాగంగా విద్యుత్ దీపాలకు ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్ (నియంత్రణ వ్యవస్థ)ఏర్పాటు చేస్తున్నట్లు రెస్కో ఎండీ సుబ్రమణ్యం చెప్పారు. ప్రయోగాత్మకంగా బుధవారం పట్టణంలోని రెస్కో కార్యాలయం ఎదుట కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.

గుడిపాల: యోగా సాధన చేస్తున్న విద్యార్థులు



తవణంపల్లె : పాఠశాలల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు





యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చిత్తూరు కలెక్టరేట్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా శిక్షకులు నరేంద్ర అన్నారు. నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. గిరింపేటలోని మున్సిపల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో యోగా శిక్షకులు నరేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకుల పరుగుల యాంత్రిక జీవనాన్ని సాగిస్తున్నారని చెప్పారు. చేసే ఉద్యోగం ఏదైనప్పటికీ మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటోందన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందడమే కాకుండా, ఒత్తిడిని జయించే శక్తి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు. సంజయ్‌గాంధీ నగర్‌లో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. పాల్గొన్న నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ కిరణ్మయి మాట్లాడుతూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం యోగా వల్ల మాత్రమే సాధ్యపడుతుందన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి బాలాజీ, బీజేపీ నాయకులు చిట్టిబాబు, ఆయుష్ శాఖ కు చెందిన మురళీమోహన్, నెహ్రూ యువకేంద్ర ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

మానసిక ఒత్తిడి దూరం

బంగారుపాళెం: యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నిత్య జీవితంలో మానవులు నిద్రలేచింది మొదలుకుని మళ్లీ నిద్రకు ఉపక్రమించేంత వరకు వివిధ రకాల మానసిక, శారీరక ఒత్తిళ్లకు గురవుతుంటారని చెప్పారు. మానసిక ఒత్తిడిని దూరం చేసే శక్తి యోగాకు ఉందని తెలిపారు. శారీరక, మానసిక రుగ్మతలను దూరం చేసి మనిషిని ఉల్లాసంగా చురుగ్గా ఉంచేందుకు యోగా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మందులు, మాత్రలకు నయంకాని జబ్బులు యోగా సాధనతో నయం అవుతాయన్నారు.

అపోలో యోగా దినోత్సవం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని అపోలో మెడికల్ కాలేజీలో బుధవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పలు యోగాసనాలు చేసి చూపించారు. అనాటమీ శాఖాధిపతి సుభద్ర దేవి యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సీఓఓ నరేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవించండి

గుడిపాల: యోగా చేసి ఆరోగ్యంగా జీవించాలని సీఎస్ఆర్ కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ అన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు యోగాపై అవగాహన కల్పించారు. లోకేష్ మాట్లాడుతూ యోగాసనాల సాధనతో మెరుగైన జీవనం పొందవచ్చన్నారు. యోగా కేవలం వ్యాయామం, ఆరోగ్యానికి సంబంధించినది మాత్రమే కాదని శక్తివంతమైన జీవనమార్గం అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్ మాట్లాడుతూ అధిక రక్తపోటు, గుండెపోటు, మధుమేహం, ఒత్తిడి స్థాయిలను తగ్గించడం వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలను యోగా పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర, అధ్యాపకులు యోగానందం, వేదవతి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

తవణంపల్లె: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్‌తో కలిసి సిబ్బంది యోగాలో భాగంగా ఆసనాలు చేశారు. వినాయక విద్యామందిర్‌లో సిద్ధ సమాధి యోగ సభ్యులు బ్రహ్మర్షి బ్రహ్మయ్య, సుబ్రమణ్యం, రెడ్డెప్ప విద్యార్థులతో పలు ఆసనాలు చేయించారు. వినాయక విద్యామందిర్ కరస్పాండెంట్ గణపతినాయుడు ఆధ్వర్యంలో బ్రహ్మర్షి బ్రహ్మయ్య ప్రసంగిస్తూ మానసికంగా, శారీరకంగా, ధృఢంగా, శక్తివంతంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగా అవసరమని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొని ఆసనాలు చేశారు.



తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో యోగా సాధనచేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

యోగాతో మానసికోల్లాసం

పూతలపట్టు: నిత్యం యోగా చేయడం వల్ల మానవ శరీరానికి మానసికుల్లాసం లభిస్తుందని ఎంపీడీఓ గౌరి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు యోగా ఆసనాలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి యోగా అత్యంత కీలకమై, యోగా ప్రక్రియ ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు. ప్రతి రోజూ యోగా చేయడం వల్ల అంతర్గత శక్తి, మానసిక ప్రశాంతత, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. యోగాతో అన్ని వయసుల వారికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఏవో చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి పాల్గొన్నారు.



అధికారుల యోగాసనాలు

గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



నల్లపురెడ్డిపల్లెలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌వేలు

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొరంపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె: ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పైమాఘం సచివాలయం పరిధిలో బుధవారం నల్లపురెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు కర్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలింతలు, చిన్నారులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హైమావతి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, కళ, డీఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు కల్పన, మెహర్ పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో క్లాప్ కింద పనిచేస్తున్న ఆటో డ్రైవర్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. నగరంలోని మునిసిపల్ గ్యారేజ్ కేంద్రంలో బుధవారం క్లాప్ డ్రైవర్లతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాగరాజన్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటా తడి-పొడి చెత్తను సేకరించే క్లాప్ ఆటో డ్రైవర్లను నియమించుకున్న ఏజెన్సీ కనీస వేతనం, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వడం లేదని చెప్పారు. ప్రస్తుతం రెండు నెలల పాటు వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకులు మణి, అజీమ్‌బాషా, గిరిబాబు, బాలాజీ, హేమచంద్ర, పృథ్వి, చిరంజీవి, మురుగ, హరి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిందలో వేడుకగా గంగజాతర



ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని పూలమాలతో సన్మానిస్తున్న జాతర నిర్వాహకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో బుధవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి విశేష పూజలను జరిపించారు. అనంతరం గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి, అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిత్యపూజలు కొనసాగాయి. సాయంత్రం ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి జనసందోహం నడుమ అమ్మవారికి గజమాల సమర్పించారు. జాతర నిర్వాహకులు డప్పువాయిద్యం, పసుపు పళ్లెంతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. తర్వాత ఆయనను ఘనంగా సన్మానించారు. రాత్రి నిర్వహించిన తమిళవీధి నాటకం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, వైస్ ఎంపీపీ రంజని, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, కుమార్, జయపాల్‌నాయుడు, మణినాయుడు, వెంకటేశులు, బాబు, రామూర్తి, మణిబాబుపిళ్లై తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైన పార్కింగ్ చేస్తే చర్యలు

యాదమరి: మండల కేంద్రంలోని మెయిన్ బజారులో ఉన్న రహదారిపై వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. రోడ్డుపైనే అడ్డదిడ్డంగా పార్కింగ్ అనే శీర్షికన మంగళవారం «సాక్షి»లో వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. బుధవారం ఉదయం మెయిన్ బజారులో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డుపై ఎక్కడంటే అక్కడ ఆటోలను ఆపేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఆటోలకు రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు యూనిఫాం ధరించాలన్నారు. ఎలాంటి రికార్డులు లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న యాదమరి పోలీసులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు జట్లుగా పోటీలలో పాల్గొన్నారు. ఆర్థిక నిరక్షరాస్యతపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో పిడివి కండ్రిగ ఉన్నత పాఠశాలకు చెందిన లక్ష్మీప్రియ, భానుమతి జట్టు ప్రథమ స్థానం, టేకుమంద జెడ్పీ హైస్కూల్ టీమ్ పల్లవి, జీవిత ద్వితీయ స్థానం, మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు హేమ, లహరి మూడవ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎంఈఓ నాగేశ్వర్‌రావు సర్టిఫికెట్లను అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పిడివి కండ్రిగ ఉన్నత పాఠశాల జట్టు ఈ నెల 28వ తేదీ చిత్తూరులో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు

చిత్తూరులో మోస్తరు వర్షం



యాదమరిలో కురుస్తున్న వర్షం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, మండల ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రోడ్లంతా జలమయంగా మారాయి. వాతావరణం పూర్తిగా చల్లబడింది. మూడు రోజుల నుంచి వాతావరణం పూర్తిగా మారింది. ఎండ నుంచి పూర్తిగా ఉపశమనం లభించింది. తేలికపాటి వర్షం కురవడంతోపాటు అడపాదడపా జోరుగా వర్షం కురుస్తోంది. ఈ కురుస్తున్న వర్షాలతో రైతులు విత్తేందుకు విత్తనాలు సిద్ధం చేసుకుంటున్నారు.

యాదమరిలో వర్షం

యాదమరి: మండల పరిధిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తేలికపాటి వర్షాలు కురవగా, బుధవారం మాత్రం చినుకులతో మొదలై భారీ వర్షం కురిసింది. రైతులు ఇక వేరుశనగ విత్తనాలు విత్తుకోవచ్చని హర్షం వ్యక్తం చేశారు.

ముంగిట పింఛన్ పిలిచెన్

- తెల్లవారకముందే లబ్ధిదారుల చేతిలో నగదు
- తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారులకు తప్పిన తిప్పలు



వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు(ఫైల్)

నియోజకవర్గంలో పింఛన్ వివరాలు		
మండలం	పింఛన్‌లు	కోట్లలో
చిత్తూరు(అర్బన్)	1,50,904	రూ.4.48
గుడిపాల	6,743	రూ.1.80
చిత్తూరు(రూరల్)	4,504	రూ.1.23

గుడిపాల: వృద్ధాప్యం.. ఒంటరి జీవనం, బతుకు ఆగమ్యం, వైకల్యంతో కష్టం, వితంతువులకు కానరాని గమ్యం, ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ, ఏం తినాలి, ఎలా బతకాలి, ఎక్కడ ఉండాలి అనే వన్నీ ప్రశ్నలే.. ఈ కష్టాలన్నీ చెరిపేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన శకానికి నాంది పలికారు. పెద్ద కొడుకులా నిస్సహాయుల జీవితాల్లో ఆనందం నింపారు. అర్హులందరికీ పింఛన్లు అందిస్తూ బడుగుల జీవితాలకు భరోసా తెచ్చారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్ల ద్వారా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, అభయహస్తం, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులకు వైఎస్సార్ పింఛను కానుక సొమ్ము అందిస్తూ ప్రతి కుటుంబానికి వెలుగు నిచ్చారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెలకు రూ.2,750 పింఛన్ అందిస్తోంది. త్వరలోనే ఆ సొమ్ము రూ.3వేలకు పెంచనుంది. వృద్ధులు, వితంతువులకు రూ.2,750, దివ్యాంగులకు రూ.3వేలు, కిడ్నీ రోగులకు రూ.10వేలు, పక్షవాత రోగులకు రూ.5వేలు చొప్పున పింఛను సొమ్ము అందిస్తున్నారు. నెలలో మొదటిరోజునే తెల్లవారక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి పింఛన్‌సొమ్ము చేతిలో పెడుతున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు పడిగాపులు.. ప్రయాసలు

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే గ్రామ పంచాయతీల కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చేవి. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. చివరికి నిరీక్షించి, రాత్రికి ఇంటికి వచ్చేవారు. ఒక్కరోజు సర్వర్ పనిచేయకపోవడంతో పంపిణీ నిలిపివేసేవారు. కొంతమంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఎన్నికల ముందు పాదయాత్రలో లబ్ధిదారుల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతిష్టాత్మకంగా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి లబ్ధిదారులకు ఇంటివద్దకే పింఛను సొమ్ము అందిస్తున్నారు. ప్రజల దీవెనలు అందుకుంటున్నారు. కొత్త పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరం చేశారు. ఎప్పటికప్పుడు కొత్త అర్హులతో వలంటీర్లు దరఖాస్తు చేయిస్తున్నారు. వీటిని పరిశీలించి అధికారులు పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఆరునెలల కోసారి (జనవరి, జూన్) కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.

ఇంటివద్దకే పింఛన్



నాకు ప్రతినెలా ఒకటో తేదీన వితంతు పింఛన్ అందుతుంది. తెల్లవారక ముందే వలంటీర్ వచ్చి తలుపు తట్టి పింఛన్ సొమ్ము రూ.2,750 అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. జగనన్న అందిస్తున్న పింఛన్ మా లాంటి వారికి ఎంతో అండగా ఉంటోంది. – విజయ, లబ్ధిదారు, వసంతాపురం

పడిగాపులు పోయాయి



చిన్నప్పటి నుంచి నాకు కాళ్లు, చేతులు సరిగ్గా పనిచేయవు. జగనన్న ఇచ్చే ఈ సొమ్ము మా కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామ వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే నరకం చూసేదాన్ని. జగనన్న వచ్చాక పడిగాపులు కాయాల్సిన బాధలు తప్పాయి. – షీబా, లబ్ధిదారు, గుడిపాల

అర్హులందరికీ పింఛన్లు



మండలంలో అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నాం. ప్రతి నెలా చివరి రోజున వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. 1వ తేదీ పింఛన్ పంపిణీకి ఎలాంటి ఇబ్బంది లేకుండా, 5వ తేదీ లోపల అందరికీ పింఛన్‌లు ఇచ్చేస్తున్నాం. బయటి ప్రాంతాల్లో ఉన్నా కూడా వలంటీర్లు వెళ్లి పింఛన్‌ను ఇస్తున్నారు. – రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో, గుడిపాల